# 'దైవానికి శరణాగతులు కండి!'

బాల్యమునందున పలువురితో కూడి
    ఆటపాటలయందు ఐక్యుడగును
యవ్వనంబలరిన అలరు విల్తుని పోల్కి
    కామినీ లోలుడై క్రాలుచుండు
అర్ధవయస్సున ఐహికంబున మున్గి
    ద్రవ్యమార్జించుట దవిలియుండు
ముదిమి వచ్చినయంత మురహరి తలవక
    అది ఇది లేదని అలమటించు
వివిధ దుర్వ్యసనంబులు వీడలేక
భక్తిమార్గంబు వెతుక ఆసక్తి లేక
కర్మపంకిలమున పడి క్రాలుచుండు
మట్టి కల్పును జన్మంబు మానవుండు

**ప్రేమస్వరూపులారా!** మానవ శరీరమును ధరించినందుకు ఇదియేనా మనం సాధించవలసింది? మానవుని జీవితము ఈవిధంగా లౌకికమైన వాంఛలతో గడచిపోతున్నది. బాల్యములో ఆటపాటలు, యౌవనములో ఇంద్రియ సుఖాలకై వెంపర్లాట... ఈరీతిగా ఆయా వయస్సునందు ఆయా ఆలోచనలు రావడం, వాటిని అనుభవించడం జరుగుతున్నది. అందులోనే ఆనందమున్నదని మానవుడు భ్రమిస్తున్నాడు. కాని, కట్టకడపటికి ఇవేవీ శాశ్వతము కాదని తెలుసుకుంటాడు. లౌకిక విషయాలన్నీ కేవలం నీటిబుడగల వలె క్షణభంగురమైనవి. ఇవేవీ మానవునికి శాశ్వతానందమును అందించలేవు. ఇంతమాత్రమునకై మానవుడు తన జీవితాన్ని పాడుచేసుకోవడం వెఱ్ఱితనము.

srisathyasaivachanamrutam

ప్రేమస్వరూపులారా! ప్రతి యుగంలో భగవంతుడు ధర్మ సంస్థాపనకై మానవాకృతిలో అవతరిస్తుంటాడు. అయితే, "ఎట్లా పుడుతున్నాడు? ఏవిధంగా పుడుతున్నాడు? మావలె తల్లిగర్భమునుండి బయల్వెడలుతున్నాడా? లేక, స్వీయసంకల్పముచేత ఉద్భవిస్తున్నాడా?" అని కొంతమందికి సందేహం కలుగుతుంటుంది. అయితే, భగవంతుడు అవతరించే పూర్వం తనకు కాబోయే తల్లిదండ్రులను తానే నిర్ణయించుకుంటాడు. 'భగవంతుడు పుట్టాడు' అని అంటున్నారు. నిజమే, తాను మానవ శరీరముతో పుట్టాడు. కాబట్టి, ప్రతి కార్యమునకు ఆ దేహమునే వినియోగిస్తుంటాడు. ప్రతి యుగములో జరుగుతున్నది ఇదే.

ద్వాపరయుగంలో కృష్ణపరమాత్మ పాండవులకు స్నేహితునిగా, బంధువుగా, గురువుగా, దైవంగా మెలగుతూ వారిని కౌరవుల కపటోపాయములనుండి సంరక్షించుకుంటూ వచ్చాడు. మహాభారత యుద్ధ సమయంలో తాను అర్జునుని రథానికి సారథ్యం వహించి, పాండవులకు విజయం చేకూర్చాడు. యుద్ధానంతరం ద్వారకకు వెళ్ళివస్తానన్నాడు. తనవెంట తోడుగా పాండవులలో ఒకరిని రమ్మన్నాడు. 'కృష్ణా! నీ స్నేహితుడైన అర్జునుని వెంట తీసుకు వెళ్ళు', అన్నది కుంతి. కృష్ణుడు అర్జునుని తనవెంట ద్వారకకు తీసికొని వెళ్ళాడు. అక్కడ అతనికి అన్నివిధములైన అనుకూలములను తానే స్వయంగా ఏర్పాటు చేశాడు. అర్జునుడు సిగ్గుపడి, 'కృష్ణా! నీతో నేను సేవలు చేయించుకుంటున్నాను కదా', అన్నాడు. అప్పుడు కృష్ణుడు, "అర్జునా! నీవు చాలా పొరపడుతున్నావు. నీవు ఎవరివి? నీ దేహము ఎవరిదనుకున్నావు? నీది కాదు, నాదే! సర్వ భూతసంరక్షకుడను నేనే. కాని, నీవు దేహముపై భ్రాంతి పెట్టుకొని పొరపడుతున్నావు.

**దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్**
**దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావు పుట్టుకల్**
**మోహ నిబంధ బంధనల ముద్రలు లేవు, నిజంబు జూడ యా**
**దేహియె దేవదేవుడు, మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ.**

దేహియే దేవదేవుడు. అదియే 'నేను'. కాని, నీవు దేహాభిమానముచేత 'నేను' అని ఉచ్చరిస్తున్నావు. దేహము నీవు కాదు. దేహాత్మబుద్ధి ఉన్నంతవరకు జీవుడు జీవుడుగానే

sri sathyasaivachanamrutam

ఉంటాడు; దేహాత్మభావము వీడగానే పరమాత్ముడవుతాడు. కనుక, దేహాభిమానమును త్యజించు. ఈ దేహము కేవలము ఒక ఆటబొమ్మ, దీనిని ఒక పనిముట్టుగా ఉపయోగించుకొని కర్తవ్య కర్మలను నిర్వర్తించాలి. మానవుడు కర్మాధికారి. ప్రపంచమంతయు కర్మపైననే ఆధారపడియున్నది. ఓ అర్జునా! ఈ జగన్నాటకమునకంతటికీ సూత్రధారి నేనే, అందరినీ నేనే ఆడిస్తున్నాను", అన్నాడు.

ఇంతలో యాదవులంతా అహంకార జనితమైన అంతఃకలహాల వల్ల నాశనమయ్యారు. కృష్ణుడుకూడా దేహాన్ని పరిత్యజించి తన నిజధామమున కేగడంతో అర్జునుడు దుఃఖసాగరములో మునిగి పోయాడు. 'కృష్ణా! ఇంతకాలం నీవు మమ్మల్ని అన్ని విధాలుగా సంరక్షిస్తూ వచ్చావు. నీవుకూడా మమ్మల్ని విడిచిపెట్టిపోతివా! ఇంక, మాకు దిక్కెవరు?' అని కన్నీరు మున్నీరుగా విలపించాడు. చేయునది లేక హస్తినాపురమునకు తిరుగు ప్రయాణమయ్యాడు. ద్వారక అంతా శిథిలమైపోయింది. యాదవులంతా కూలిపోయారు. అటువంటి విషాదకరమైన పరిస్థితిలో అర్జునునికి ఏమి చేయడానికీ పాలుపోలేదు. హస్తినకు వెళుతూనే తల్లి, 'నాయనా! గోపాలు డెట్లున్నాడు?' అని అడుగుతుంది. అప్పుడేమి జవాబు చెప్పాలి? తనను తానే ప్రశ్నించుకున్నాడు. కాని, జవాబు చిక్కలేదు. 16 వేలమంది గోపికలను వెంటపెట్టుకొని ద్వారక విడిచిపెట్టాడు. అయితే, మార్గమధ్యంలో ఆటవికులు వారిని చుట్టుముట్టారు. కాని, వారితో యుద్ధము చేయడానికి అర్జునునికి శక్తి లేకపోయింది. మహాభారత యుద్ధ సమయంలో శత్రుసైన్యాన్ని తన శరపరంపరతో కకావికలం చేసిన అర్జునుడు ఆనాడు తన గాండీవమును సహితం ఎత్తలేక పోయాడు. నిస్సహాయుడై, 'కృష్ణా! నా శక్తి ఎక్కడికి పోయింది?' అని విలపించాడు. 'ఎవరిచ్చారో వారే తీసుకున్నారు', అని దానికి జవాబు తానే చెప్పుకున్నాడు. 'కృష్ణా! నీ గోపికలను నీవే కాపాడుకో', అని ప్రార్థించాడు. అప్పుడు కృష్ణుడే వారిని అన్ని విధాలుగా కాపాడినాడు. అర్జునుడు ఆ గోపికలను క్షేమంగా హస్తినకు చేర్చాడు.

ధర్మరాజు ఖిన్నవదనుడై వస్తున్న అర్జునుని చూడగానే కీడు శంకించాడు. 'అర్జునా! ఏమిటి, ఇంత విచారంగా ఉన్నావు?' అని అడిగాడు. 'అన్నా, అన్ని విషయాలు తరువాత

sri sathyasaivachanamrutam

వివరంగా చెబుతాను', అన్నాడు, అర్జునుడు. కృష్ణుడు తన నిజధామమునకేగినాడనిగాని, యాదవులు నశించారనిగాని అప్పుడేమీ చెప్పలేదు. వృద్ధురాలైన కుంతీదేవి అర్జునుడు వచ్చాడన్న వార్త తెలియగానే మంచంపై లేచి కూర్చున్నది. 'నాయనా! అర్జునా! నా గోపాలుడు బాగున్నాడా? అన్ని విశేషాలు నాకు చెప్పు', అని అడిగింది. అర్జునుడు మూర్ఛపడి, లేచి కూర్చుని, 'అమ్మా! కృష్ణుడు మనకిక లేడు', అని విలపిస్తూ జరిగిన కథంతా చెప్పాడు. కృష్ణుడు పోయినాడని చెప్పేసరికి కుంతీదేవి మంచంపైననే కూలిపోయింది. ధర్మజుడు తల్లి శిరస్సును తన తొడపై పెట్టుకున్నాడు. మిగిలిన సోదరులందరూ పాదములు వత్తుతున్నారు. అప్పుడు ధర్మజుడు, 'జరగవలసిందేదో జరిగిపోయింది. అంతా కృష్ణునియొక్క లీలయే! అమ్మా, లే!' అన్నాడు. కాని, కుంతిలో చలనము లేదు. ఆమె కృష్ణచింతనలోనే ప్రాణం విడిచింది.

అప్పుడు ధర్మజుడు పండితులను పిలిపించి, పరీక్షిత్తుకు పట్టాభిషేకము చేయడానికి ఏర్పాట్లు చేయమన్నాడు. భీమార్జున నకుల సహదేవులు కుంతి పాదములదగ్గర నిల్చున్నారు. 'నకులా! సహదేవా! మనము హిమవత్ పర్వతములవైపు వెళ్లాలి. మీరిద్దరూ మన ప్రయాణమునకు అన్నీ సిద్ధం చేయండి', అని ఆదేశించాడు. ఒకవైపున కృష్ణుడు తన నిజధామమునకేగినాడన్న వార్త, మరో వైపున కుంతీదేవి హఠాన్మరణము ఈ రెండు బాధలను ద్రౌపది భరించలేకపోయింది. కుంతీదేవి అంత్యక్రియలకు కావలసిన ఏర్పాట్లు చేయమని ధర్మజుడు అర్జునునికి చెప్పాడు. 'కృష్ణుడు పోయాడు, ప్రేమపూరితమైన తల్లి పోయింది. ఇక, మేము బ్రతికి ప్రయోజనమేమిటి?' అని విలపిస్తూ పాండవులు కుంతీదేవి భౌతిక కాయాన్ని స్మశానమునకు తీసుకు వెళ్ళారు. ప్రజలందరూ శోకిస్తూ వెంట వెళ్ళారు. ధర్మరాజు నిప్పు పట్టుకొని ముందు నడిచాడు. ఆనాడుకూడా ఈనాటి సంప్రదాయ ముండేది. పాండవులు కుంతి దేహాన్ని స్మశానానికి తీసుకుపోతూ, 'కృష్ణా! మా ప్రాణములను కూడా తీసుకుపో', అని విలపించారు. అక్కడకు పోయిన తరువాత పెద్ద కుమారుడైన ధర్మజుడు కుంతీదేవి మృతశరీరమునకు నిప్పు పెట్టాడు.

కుంతికి అంత్యక్రియలు నిర్వర్తించిన తరువాత పాండవులు పరీక్షిత్తుకు పట్టాభిషేకము

srisathyasaivachanamrutam

చేశారు. ఇదేమి చిత్రము! ఎంత విచిత్రము! 'మాతృదేవిని, ప్రాణసమానుడైన కృష్ణుని పోగొట్టుకుని, ఆ దుఃఖ సమయంలో పట్టాభిషేకము చేయడమేమిటి!', అని ప్రజలు ఆశ్చర్యపోయారు. అయితే, జరుగవలసినవి జరుగక తప్పదు. పాండవులు హిమాలయాలకు వెళ్ళిన తరువాత హస్తినాపురమునకు ఎవరో ఒక సంరక్షకుడు ఉండాలి కదా! పండితులు వేదమంత్రాలను పఠిస్తూ పరీక్షిత్తు తలపై కిరీటము పెట్టారు. కాని, పరీక్షిత్తు మాత్రం సంతోషంగా లేడు. 'మీరందరూ కలసి ఈ కిరీటమును నా తలపై పెట్టడం భావ్యమా! నేనెంతటివాడను! అత్యంత అల్పుడను. మీలో ఎవరో ఒకరు ఈ కిరీటమును పెట్టుకొని రాజ్యమును ఏలవచ్చు కదా!' అని ప్రాధేయపడ్డాడు. అప్పుడు ధర్మజుడు, 'నాయనా! మేమింక ఇక్కడ ఉండము. జరగవలసింది జరగాలి. ప్రజల యోగక్షేమాలను నీవే చూసుకోవాలి. దీనిని నీవు ఆపడానికి వీల్లేదు', అని చెప్పాడు. తానింక చేయునది లేక పరీక్షిత్తు ఆ బ్రాహ్మణుల సూచనల ననుసరించి పట్టాభిషేకము చేయించుకున్నాడు. 'జయమంగళం నిత్య శుభ మంగళం' అని పెద్దలు అతనికి ఆశీస్సులందించారు.

పాండవులు మహాప్రస్థానానికి బయలుదేరుతూ, దుఃఖిస్తున్న పరీక్షిత్తును దగ్గరకు తీసికొని, 'నాయనా! నీవు మా పేరు నిలబెట్టాలి. ప్రజారంజకంగా పరిపాలించి వారి మన్నన లందుకోవాలి. ప్రజలను కంటికి రెప్పవలె కాపాడాలి', అని బోధించారు. అప్పుడు పరీక్షిత్తు, 'నేను ప్రజలను నా ప్రాణసమానంగా చూసుకొని కాపాడుతాను', అని ప్రమాణం చేశాడు. అదేరీతిగా, తాను ప్రజలను కన్నబిడ్డలవలె చూసుకున్నాడు. అతని పరిపాలనలో అందరూ సుఖసంతోషాలతో జీవిస్తూ వచ్చారు.

పాండవులు ప్రజలదగ్గర సెలవు తీసికొని, ఆ పట్టాభిషేకము జరిగిన మండపమునుండే నేరుగా హిమాలయాలకు బయలుదేరారు. మార్గమధ్యంలో తల్లి అస్థికలను గంగలో కలిపారు. అంతే, తరువాత ఎట్లా పోయారో, ఏమి చేశారో ఎవ్వరికీ తెలియదు. ద్రౌపది, భీమార్జున నకులసహదేవులు మార్గమధ్యంలో కూలిపోయారు. చివరికి, ధర్మరాజు ఒంటరిగా ప్రయాణం సాగించాడు. మహా ప్రస్థానంలో పాండవులు దేహము వదలిపెట్టారని తెలిసి పరీక్షిత్తు, ప్రజలు చాలా బాధపడ్డారు. అంత్యములో విధి పాండవులపట్ల చాలా

srisathyasaivachanamrutam

క్రూరంగా ప్రవర్తించినట్లు వారికనిపించింది. కాని, విధి విలాసమును ఎవరు అర్థం చేసుకోగలరు! ఎవరి గతి ఎటుల ఉండునో ఎవరికెరుక! ఒక్క ఈశ్వరునికి తప్ప మరెవ్వరికీ తెలియదు. 'శ్రీకృష్ణుడు, పాండవులు లేని జీవితం మాకెందుకు?' అని అనేకమంది ప్రాణములు త్యజించారు. పంచ పాండవులు ఎంతో పౌరుషము గలవారు, ఆదర్శవంతులు. నిరంతరము భగవంతుని తలుచుకుంటూ కాలము గడపడంచేత వారికి సునాయాస మరణం ప్రాప్తించింది. పాండవులవలెనే పరీక్షిత్తు కూడా మహా శౌర్యవంతుడు, ఆదర్శ ప్రాయుడు. రాజ్యపరిపాలనా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూనే నామస్మరణతో తన కాలము గడుపుతూ వచ్చాడు. అయితే, అతను హస్తినాపుర సింహాసనము నధిష్ఠించిన తరువాత దుష్టులైన రాజులందరూ ఏకమై అతనిపైకి దండెత్తి వచ్చారు. అయితే, కొందరు ధర్మాత్ములైన రాజుల సహాయంతో పరీక్షిత్తు వారిని తరుమగొట్టాడు. కృష్ణపరమాత్మునిపట్ల అతనికి గల అచంచలమైన విశ్వాసముచేతనే పరీక్షిత్తుకు విజయం చేకూరింది. అందుకోసమే నేను చెబుతుంటాను,

'అడవులందున్న ఆకసముననున్న
పట్టణముననున్న పల్లెనున్న
గుట్టమీదనున్న నట్టేట పడియున్న
దిక్కు లేనివారికి దిక్కు దేవుడేను'

పాండవులు పరీక్షిత్తుకు పట్టం కట్టినప్పుడు, 'పిల్లవానికి రాజ్యమిచ్చి ఏ గతి పట్టిస్తారో యేమో', అని ప్రజలు భయాందోళనలకు గురి అయ్యారు. ఐతే, కృపాచార్యుని కుమారునియొక్క సూచనలను, సలహాలను పాటిస్తూ, పాండవుల అడుగుజాడలలో నడుస్తూ పరీక్షిత్తు పరిపాలనా దక్షునిగా పేరు తెచ్చుకున్నాడు. పరిపాలనా వ్యవహారాల నుండి కొంత తీరిక చేసుకొని పాండవులు ఎక్కడ దేహము వదలిపెట్టారో అక్కడికి పోయాడు. ఆ ప్రదేశం చుట్టూ ప్రదక్షిణ చేసి ఆ మట్టిని శిరస్సుపై ధరించాడు. పాండవుల ఆదర్శాలను ఆచరణ పూర్వకంగా జగత్తుకు చాటుతూ వచ్చాడు. పాండవులు ఈ ప్రపంచానికే ఆదర్శప్రాయులు. వారి ఆదర్శములను ఆధారం చేసుకొని మన జీవితాన్ని

srisathyasaivachanamrutam

ప్రశాంతంగా గడుపుకోవాలి. కొన్ని సమయాల్లో దుఃఖమును అనుభవించవలసి రావచ్చు. దుఃఖము వచ్చినా దానిని అరికట్టుకోవాలి. అప్పుడే మనయందు నిజమైన శక్తి ఆవిర్భవిస్తుంది.

విద్యార్థులారా! మీరు పిల్లలు, సుదీర్ఘమైన జీవిత ప్రయాణం సాగించవలసినవారు. పరీక్షిత్తు పట్టాభిషిక్తుడైనప్పుడు మీకంటే చిన్నవాడు. అయితే, భగవంతునిపట్ల అచంచలమైన విశ్వాసముతో, ధైర్యముతో తన కర్తవ్యాన్ని నిర్వర్తించాడు. మీరుకూడా అట్టి ధైర్యముతో సమాజశ్రేయస్సుకై పాటుపడాలి. అట్టి ఆదర్శమును మీరు ఎప్పటికీ వదలకుండా కొనసాగించడానికి తగిన శక్తిని ప్రసాదించవలసిందిగా దైవాన్ని ప్రార్థిస్తూ ఉండాలి. పాండవులు ఏనాడో ఈ లోకాన్ని విడిచి పోయారు. కాని, వారి ఆదర్శాలు మాత్రం ఆచంద్రతారార్కం నిలిచి ఉంటాయి. మీరందరూ చాలా మంచి పిల్లలు. అందరూ మిమ్మల్ని ఆదర్శంగా తీసుకునేటట్లుగా మీరు నడుచుకోవాలి. దుఃఖానికి చోటివ్వ కూడదు. దేనికీ భయపడకూడదు. ఎవ్వరికీ మీరు బానిసలు కాకూడదు. దైవానికి శరణాగతులు కండి. 'అన్నింటికీ భగవంతుడు ఉన్నాడు', అని ధైర్యంగా ముందుకు సాగండి.

శ్రీవారి దివ్యబోధ
తేదీ 07.10.2005

sri sathyasai vachanamrutam